క్లుప్తంగా

రెవెన్యూ సేవల్లో అంతరాయం ఉండకూడదు



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

ఎల్‌.ఎన్‌.పేట: ప్రజలకు అందించే రెవెన్యూ సేవల్లో అంతరాయం ఉండకుండా చూసుకోవాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి సూచించారు. మండలంలోని చింతలబడవంజ వద్ద నిర్మాణం జరుగుతున్న పెట్రోల్ బంకుతో పాటు మోదుగువలస వద్ద జరుగుతున్న వాణిజ్యపరమైన నిర్మాణాలను మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం స్థానిక రెవెన్యూ సిబ్బందితో మాట్లాడారు. రేషన్ బియ్యం పంపిణీ, రేషన్ కార్డుదారుల ఈకేవైసీ నమోదు వంటి ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ జె.ఈశ్వరమ్మకు ఆదేశించారు. ఆయనతో పాటు ఆర్ఐ ఎస్.గవరయ్య తదితరులు ఉన్నారు.

పశు పోషణలో జాగ్రత్తలు తీసుకోవాలి



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

పాతపట్నం: పాడి రైతులు పశు పోషణలో జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ మంచు కరుణాకరరావు సూచించారు. మండలంలోని బి.గోపాలపురం గ్రామంలో జరుగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాడి రైతులకు పశు సంరక్షణపై అవగాహన కల్పించారు. వేసవిలో పశువులకు సోకే వ్యాధులు, వాటి లక్షణాలను వివరించారు. పశువులకు నోరు, కాలిగిట్టల వద్ద పుండ్లు ఏర్పడితే తక్షణమే పశు వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఇప్పటివరకు 8,700 పశువులకు గాలికుంటు టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది నిరంజన్, మోహన్, శంకర్, పరమేశ్వరి, ఉత్తమరావు తదితరులు పాల్గొన్నారు.


నాటుసారా విక్రయిస్తే చర్యలు



ఎగువబగడలో ప్రచారం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

మెళియాపుట్టి: గ్రామాల్లో నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. మండలంలోని ముకుందాపురం, చింతలపోలూరు, రాయిగుడ్డి, సవర బాణాపురం, ఎగువ బగడ, బాణాపురం తదితర గ్రామాల్లో నాటుసారా తయారీ నిర్మూలనలో భాగంగా నవోదయం 2.0 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రచార రథం ద్వారా గిరిజన ప్రజలకు అవగాహన కల్పించారు. సారా వలన అనేక కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యువత మంచిగా చదువుకొని, ఉద్యోగాల్లో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: గిరిజనులకు వారి హక్కులపై అవగాహన అవసరమని కొత్తూరు వెలుగు అసోసియేషన్ సభ్యులు సూచించారు. మండలంలోని ఇల్లాయిపురం గ్రామంలో గిరిజన హక్కులపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. దిగువ రింపి, ఎగువ రింపి గ్రామాల ప్రజలకు పోడు పట్టాలు పొందడం, అటవీ హక్కుల గురించి తెలియజేశారు. పథకాలకు ఎలా దరఖాస్తు చేసుకోవాలో సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ చిరంజీవి, కో-ఆర్డినేటర్ నాగరాజు, సమన్వయకర్త జగన్, మొబలైజర్లు కల్యాణి, హరిశ్చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం 12 వరకే అంగన్‌వాడీలు

ఆమదాలవలస: ఆమదాలవలస ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు ఈనెల 18వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే తెరిచి ఉంచాలని ఐసీడీఎస్ పీవో ఎస్.అనురాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి దృష్ట్యా ప్రభుత్వ ఆదేశాల మేరకు సమయం మార్చినట్లు పేర్కొన్నారు. కార్యకర్తలు, సహాయకులు బాధ్యతగా ప్రీ స్కూల్ పిల్లలకు వేడి ఆహారం ఇచ్చి గృహాలకు పంపించాలన్నారు.

కరకట్టాలు..!



వాడవలస వద్ద కోతకు గురైన పంట పొలం(ఫైల్)

- రాతికట్టలు లేకపోవడంతో నదీతీర ప్రజల అవస్థలు
- నదిలో కలుస్తున్న పంట భూములు
- భూములున్నా కూలీలుగా మారుతున్న వైనం



లక్ష్మీనర్సుపేట వద్ద కోతకు గురైన తోటలు

ఎల్‌.ఎన్‌.పేట: వర్షాకాలం వస్తే వంశధార నదీతీర ప్రాంత ప్రజలు చిగురుటాకులా వణికిపోతారు. నదీ పరివాహక ప్రాంతాల్లో కరకట్టలు లేకపోవడం వలన ఆ గ్రామాలతో పాటు పంట భూములు ముంపునకు గురవుతున్నాయి. దీంతో వంశధార తీరంలో భూములు, పండ్ల తోటలు ఉన్నందుకు బాధపడాలో.. సంతోషించాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. వంశధార నదికి ప్రతీ ఏడాది వచ్చే వరదలు కారణంగా విలువైన పంట భూములు, చేతికి అందివచ్చే పంటలు నదిలో కలిసిపోతున్నాయి. ఆదుకోవాల్సిన అధికారులు, పాలకుల మాటలు కంటి తుడుపు చర్యలే అవుతున్నాయని బాధితులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి రెవెన్యూ రికార్డుల్లో రైతులకు చెందిన భూములు ఉంటాయి. కానీ ఆయా భూములు వంశధార నది నీటి ప్రవాహంతో కోతకు గురై నదిలోనే ఉంటాయి. ఇసుక మేటలు వేసి ఎందుకూ పనికి రాకుండా ఉన్నాయి. దీంతో భూములు ఉన్న రైతులు కూలీలుగా మారిపోతున్నారు. అందువలన ఈ వేసవిలో అయినా కరకట్టల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాతపట్నం నియోజకవర్గంలో...

- పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరు, హిరమండలం, ఎల్‌.ఎన్‌.పేట మండలాల్లో సుమారు 41 కిలోమీటర్ల మేరకు వంశధార నదీ పరివాహక ప్రాంతం ఉంది.
- కొత్తూరు మండలంలోని సిరుసువాడ, ఆకుల తంపర, మాకవరం, పెనుగొటివాడ, వి.ఎన్.పురం, మాతల, కుద్దిగాం, బంకి, పొనుటూరు, కుంటిభద్ర, వసప, మదనాపురం, రామకృష్ణాపురంతో పాటు మరికొన్ని గ్రామాలు వంశధార తీరంలో ఉన్నాయి.
- హిరమండలం మండలంలోని గులుమూరు, కొండరాగోలు, గొట్ట, తుంగతంపర, దుర్బలాపురం, హిరమండలం, పాత హిరమండలం, అంబావిల్లి, అక్కరాపల్లి, రెల్లివలస, భగీరథపురం, భగీరథపురం కాలనీ తదితర గ్రామాల భూములు నదీ తీరంలో ఉన్నాయి.
- ఎల్‌.ఎన్‌.పేట మండలంలోని స్కాట్‌పేట, మోదుగువలస, బసవరాజుపేట, పెద్దకోట, లక్ష్మీనర్సుపేట, మిరియాపల్లి, వాడవలస, దబ్బపాడు, సీతారాంపురం తదితర గ్రామాలను దాటి సరుబుజ్జిలి మండలంలోకి వంశధార నది ప్రవేశిస్తుంది.

వంశధార నదితీరం వివరాలు

మండలం	తీరం (కి.మీ)	తీరప్రాంత గ్రామాలు	కోతకు గురైయ్యే భూములు (ఎకరాల్లో..)	బాధిత రైతులు
కొత్తూరు	18	14	58 ఎకరాలు	128 మంది
హిరమండలం	10	12	19	47 మంది
ఎల్‌.ఎన్‌.పేట	13	9	21	62 మంది

వర్షాకాలం వస్తే గండమే



వర్షాకాలం వచ్చిందంటే వంశధార నదీతీర ప్రాంతంలో ఉన్న రైతులకు దిన దిన గండమే. వరద నీటి ప్రవాహ వేగానికి తీరంలో ఉన్న విలువైన పంట భూములు, పండ్ల తోటలు నదిలో కలిసిపోతున్నాయి. నీటి ప్రవాహానికి చెట్లు నదిలో కొట్టుకుపోతున్నాయి. రైతులు భూములు కోల్పోయి, పంటలు, చెట్లు కోల్పోయి ఆర్థికంగా ఎంతో నష్టపోతున్నారు. ప్రతీ ఏడాది ఇదే పరిస్థితి ఉంటుంది.

– అశోక్ కుమార్ పాణిగ్రహి, లక్ష్మీనర్సుపేట, ఎల్‌.ఎన్‌.పేట

రాతికట్టలు కట్టాలి



వంశధార నదికి వచ్చే వరదల నియంత్రణ కోసం తీరంలో కరకట్టలు నిర్మించాల్సి ఉంది. కరకట్టలు నిర్మిస్తే పంటలకు, పంట భూములకు నష్టం జరగదు. వర్షాకాలంలో ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు వంశధార నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటే తీరంలో ఉన్న భూములు కోతకు గురై నదిలో కలిసిపోతున్నాయి. అధికారులు, పాలకులు స్పందించి నదీ తీరంలో కరకట్టలు, రాతి కట్టలు కట్టాలి.

– పల్లి అప్పలనాయుడు, మిరియాపల్లి, ఎల్‌.ఎన్‌.పేట

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



వంశధార నదీతీరంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించడం జరిగింది. వారికి జరుగుతున్న నష్టాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. కరకట్టల నిర్మాణానికి ఇంతకుముందు భూసేకరణ జరిగింది. తీర ప్రాంతంలో ఉన్న రైతులను ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

– జె.ఈశ్వరమ్మ, తహసీల్దార్, ఎల్‌.ఎన్‌.పేట

మత్తు పదార్థాలతో జీవితం నాశనం



అవగాహన కల్పిస్తున్న పోలీసు సిబ్బంది

ఆమదాలవలస: మత్తు పదార్థాల వినియోగం వలన జీవితం నాశనమవుతుందని పోలీస్ శాఖ ప్రతినిధి గోవిందరావు అన్నారు. పట్టణంలోని శ్రీవేంకటేశ్వర పారిశ్రామిక శిక్షణ సంస్థల ఆవరణలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని స్పష్టం చేశారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, యువత సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంస్థ డైరెక్టర్ కూన భానుజీరావు, ఐటీఐ ప్రిన్సిపాల్ డీవీ ప్రసాద్, పైడి సంతోష్ కుమార్, శ్రీనివాసరావు, సుమంత, ఉరిటి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తత అవసరం



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

ఆమదాలవలస: వేసవికాలంలో పశువులకు సంక్రమించే వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధకశాఖ డివిజినల్ ఉపసంచాలకుడు డాక్టర్ పి.రామ్మోహన్‌రావు సూచించారు. మున్సిపాలిటీలోని రెండో వార్డు కృష్ణాపురం గ్రామంలో బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు, గాలికుంటు నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి సంక్రమిస్తే తీసుకోవాల్సిన నివారణ చర్యలను రైతులకు వివరించారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు నాలుగు మాసాల వయసు కలిగిన దూడల నుంచి అన్ని వయస్సుల పశువులకు వేయవచ్చన్నారు. ప్రభుత్వం ఉచితంగా వేస్తున్న టీకాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ రోణంకి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 21న టేకు చెట్ల వేలంపాట

బూర్జ: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని టేకు చెట్ల వేలంపాటను ఈనెల 21వ తేదీన ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వై.వి.పద్మావతి తెలియజేశారు. ఇటీవల వేసిన వేలంపాటలో ఆసక్తి కనబర్చినవారు ప్రభుత్వం నిర్ణయించిన మొత్తానికి రాకపోవడంతో పాట నిలుపుదల చేసి, రెండోదపా వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆసక్తి ఉన్నవారు తహసీల్దార్ కార్యాలయం నందు హాజరవ్వాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



ఆలయంలో పూజలందుకుంటున్న అమ్మవారు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తుల పూజలందుకుంటున్న పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఆలయానికి మాఘమాసం మంగళవారం కావడంతో భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు ఘటాలతో తరలి వచ్చారు. అమ్మవారికి ముర్రాటలు ఇచ్చి, ఘటాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవోపేతంగా చక్రతీర్థ స్నానాలు

కొత్తూరు: పట్టణంలోని వేంకటేశ్వర స్వామివారి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక హరిదాసు కోనేరులో స్వామివారి చక్రతీర్థ స్నానాలు మంగళవారం చేపట్టారు. ముందుగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి కొత్తూరులోని ప్రధాన వీధుల గుండా కోనేరు వరకు తిరువీధి నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు అనంతరం స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో చక్రతీర్థ స్నానాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎల్.తాతబాబు, గుడ్ల కృష్ణారావు, పాగిరి రవి తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: ఉత్సవ విగ్రహాలకు చక్రతీర్థ స్నానాలు చేయిస్తున్న దృశ్యం

అధ్యక్ష పదవికి మూడు నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న విజయలక్ష్మి

ఆమదాలవలస: ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్ల పర్వం మంగళవారం ముగిసే నాటికి మూడు నామినేషన్లు దాఖలైనట్లు నిర్వాహకులు తెలియజేశారు. ప్రస్తుత బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మీబాయ్‌తో పాటు సీనియర్ న్యాయవాదులు పైడి వరాహ నరసింహులు, చింతాడ సత్యనారాయణలు నామినేషన్లు వేశారు. బుధవారం ఈ నామినేషన్ల స్క్రూట్నీ చేపట్టనుండగా, ఉపసంహరణకు గురువారం వరకు గడువు ఉంది. అయితే బార్ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యేలా సీనియర్ నాయకులు మంతనాలు జరుపుతున్నారు. ఈ ప్రయత్నాలు విఫలమైతే ఈనెల 27వ తేదీన బార్ అసోసియేషన్ ఎన్నికలు జరగనున్నాయి.

సమయపాలన తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో నీరజ

కొత్తూరు: గ్రామ సచివాలయాల సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంపీడీవో నీరజ సూచించారు. మండలంలోని కర్లెమ్మ గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గ్రీవెన్స్ సెల్‌లో వచ్చిన వినతులు పరిశీలించి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. గ్రామ సచివాలయం పరిధిలోని ప్రజల పూర్తి సమాచారం అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు.

సారా రహిత గ్రామాలే లక్ష్యం



మాట్లాడుతున్న సీఐ కృష్ణారావు

పాతపట్నం: నాటుసారా రహిత గ్రామాలే తమ లక్ష్యమని ఎక్సైజ్ సీఐ కె.కృష్ణారావు అన్నారు. మండలంలోని ఎస్.ఎస్. మనుగు పంచాయతీ పరిధి బొన్ని గిరిజన గ్రామంలో నవోదయం -2.0 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నవ సమాజానికి నాంది నవోదయం అన్నారు. గ్రామాలను ఆరోగ్యవంతంగా సారా రహితంగా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. దేశానికి యువత అత్యుత్తమమైన సంపదని, వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. యువకులు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సవర సింధు, వైస్ సర్పంచ్ కె.కామేశ్వరరావు, ఆర్.వెంకటరమణ, ఉమామహేశ్వరరావు, అరుణకుమారి, కృష్ణవేణి, ఆదిలక్ష్మి, సింహాచలం, గౌరి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం ఎన్నడో..?



సారవకోట పోలీసుస్టేషన్ ఆవరణలో వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు మూలుగుతున్నాయి. సుమారు 15 ద్విచక్ర వాహనాలు, ఒక సైకిల్‌తో పాటు ఆటోలు సైతం కొన్నేళ్లుగా ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పుపడుతున్నాయి. అందువలన ఈ వాహనాలకు వేలంపాట నిర్వహిస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. – సారవకోట

ఆకట్టుకున్న వేషధారణలు



నరసన్నపేట పట్టణంలోని విద్యార్థి భవన్ స్కూల్ విద్యార్థులు స్వామీ వివేకానంద వేషధారణల్లో ఆకట్టుకున్నారు. స్కూల్ వార్షికోత్సవం పురస్కరించుకొని ఈవిధంగా అలరించారు. ఈ సందర్భంగా చిన్నపిల్లల వైద్య నిపుణులు బి.నవీన్, తర్ర సురేష్ కుమార్, జనరల్ మెడిషన్ వైద్య నిపుణుడు సూరపు పవన్ కుమార్‌లు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త కె.రామారావు, స్కూల్ యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు. – నరసన్నపేట

సీసీరోడ్డు నిర్మాణం చేపట్టరూ..?



ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి రెండో వార్డు కృష్ణాపురంలోని సనవలవానివీధికి పూర్తి స్థాయి రహదారి లేదు. స్థానికుల చొరవతో మట్టిరోడ్డు నిర్మించినప్పటికీ ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగాయి. గోతులు సైతం ఏర్పడడంతో వర్షంపడితే ఆ రహదారి గుండా ప్రయాణించడం నరకప్రాయమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువలన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – ఆమదాలవలస

వలంటీర్లను ప్రభుత్వం మోసగించింది

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్‌.ఎన్‌.పేట: గ్రామ, వార్డు వలంటీర్లను కూటమి ప్రభుత్వ మోసం చేసిందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు వలంటీర్లను తొలగించమని, నెలకు రూ.10 వేలు జీతం ఇచ్చి కొనసాగిస్తామని చెప్పి నట్టేటా ముంచారని మండిపడ్డారు. ఎన్నికల్లో గెలిచేందుకు సీఎం చంద్రబాబు ఎన్ని అబద్ధాలైనా చెప్పడానికి వెనుకాడని వ్యక్తి అని మరోసారి రుజువైందన్నారు.

కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా వలంటీర్లను కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్ల సేవలు ప్రశంసనీయమైనవని పేర్కొన్నారు.

ఒక కుటుంబం ఓట్లన్నీ ఒకేచోట



మాట్లాడుతున్న ఆర్వో శ్రీధర్ రాజా

పాతపట్నం: ఒక కుటుంబం ఓట్లన్నీ ఒకేచోట ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పాతపట్నం నియోజకవర్గ ఎన్నికల అధికారి, జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆల్ పార్టీ నాయకులతో సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకే కుటుంబానికి చెందిన ఓట్లు వేర్వేరు చోట్ల ఉండడం సమస్య మెళియాపుట్టి, పాతపట్నంలోనే అధికంగా ఉందని, ఇప్పటికే ఇటువంటి సమస్యలు సరిచేశామని, మిగిలిన వాటిని కూడా గుర్తించి త్వరలోనే సరిచేస్తామన్నారు. గ్రామాల్లో లేనివారు, పూర్తిగా వలస వెళ్లినవారి పేర్లు కూడా ఓటర్ల జాబితాలో ఉన్నాయని, వాటిని తొలగించాలని రాజకీయ పార్టీల నాయకులు కోరారు. ఇటువంటి పేర్లు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో తహసీల్దార్లు ఎస్.కిరణ్ కుమార్, రవిచంద్ర, కె.బాలకృష్ణ, బి.పాపారావు, ఎస్.రామకృష్ణ, బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

శక్తియాప్‌తో మహిళలకు రక్షణ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నరసన్నపేట: శక్తియాప్‌తో మహిళలకు రక్షణ లభిస్తుందని ఎస్ఐ వి.బాలకృష్ణ అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినులకు యాప్ ప్రయోజనాలు వివరించారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో పోలీసుస్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా, శక్తి యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. మహిళలకు ఆపద కాలంలో అత్యవసర సాయం అందించేందుకు శక్తి యాప్ కీలకంగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎం.శ్రీనివాస్, లక్కోజీ గౌరీ శంకర్, రమణ, మహిళా కానిస్టేబుల్ కుసుమ తదితరులు పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

పాతపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనంలో మెనూ సక్రమంగా అమలు చేయాలని ఎంఈవో-1 ఎ.గోవిందరావు సూచించారు. మండలంలోని తామర ఎంపీపీ పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు విద్యాబోధన, అందిస్తున్న మెనూ వివరాలు, మౌలిక సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు, స్టోర్ రూమ్ రికార్డులు పరిశీలించారు. పాఠశాలకు ప్రహరీ లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవోకు తెలిపారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేస్తానని ఆయన చెప్పారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

నరసన్నపేట: మండలంలోని మడపాంలో వేసవి తీవ్రత దృష్ట్యా ప్రయాణికులతో పాటు జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో చలివేంద్రం మంగళవారం ప్రారంభించారు. సర్పంచ్ రాపర్తి ఎరుకోడు, ఎంపీటీసీ రువ్వ వాసుదేవరావులు సంయుక్తంగా ప్రారంభించారు. వాహనదారులు, ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సుందరరావు తదితరులు పాల్గొన్నారు.